క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న నూర్ బాషా నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర నూర్ బాషా సంఘం తరుపున స్థానిక అశోక్ నగర్‌లోని పలువురు ముస్లిం వృద్ధ మహిళలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రతి నెలా పేదలకు తమ సంఘం ద్వారా అందించే సహాయ కార్యక్రమంలో భాగంగా నిత్యావసరాలను అందజేశామని సంఘం అధికార ప్రతినిధి షేక్ సయ్యద్ బాజీ (గాజుల బాజీ) తెలిపారు. సంఘ సభ్యులు షేక్ సత్తార్ పాల్గొన్నారు.

వర్షాలతో పలు రైళ్ల రద్దు

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాల కారణంగా దక్షిణమధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మీదుగా వెళ్లే పలు రైళ్లను సోమ, మంగళవారాల్లో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నెంబర్ 12806 లింగపల్లి – విశాఖపట్టణం, 17016 సికింద్రాబాద్ – భువనేశ్వర్, 07165 హైదరాబాద్ కటక్, రైలును 3వ తేదీన పూర్తిగా రద్దు చేశారు. 17166 కటక్ – హైదరాబాద్ రైలును 4వ తేదీన రద్దు చేశారు. 12703 హౌరా – ఎస్ఎంవీటీ బెంగులూరును 2వ తేదీన, 12740 సికింద్రాబాద్ – విశాఖపట్టణం రైలును 3వ తేదీన రద్దు చేశారు. 12841 షాలిమార్ చెన్నై సెంట్రల్, 22850 చెన్నై సెంట్రల్ – పూరి రైళ్లను 2వ తేదీన పూర్తిగా రద్దు చేశారు. వీటితో పాటుగా పలు రైళ్లను దారి మళ్లించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



లింగారావుగూడెం ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై దుర్గాప్రసాదరావు

ఏలూరు టౌన్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొల్లేటి ప్రాంతానికి వరద ముంపు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని లింగారావుగూడెం గ్రామ ప్రజలను ఏలూరు రూరల్ ఎస్సై దుర్గా ప్రసాదరావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన లింగారావుగూడెం గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. వరద నీరు ప్రవహించే ప్రాంతాలలో నిర్లక్ష్యంగా ఉండవద్దని అన్నారు. పడిపోవడానికి సిద్ధంగా ఉన్న గృహాల్లో, పాత గృహాల్లో నివాసం ఉండొద్దని, ఏదైనా ఇబ్బందుల ఉండే ముందుగానే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వైఎస్ అంటే నమ్మకం, భరోసా

నగరంలో వైఎస్‌కు ఘన నివాళి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అంటే ఒక నమ్మకం, ఒక భరోసా అని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమం స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని వైఎస్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలు అప్పట్లోనే దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలిచాయని గుర్తుచేశారు. పేదల సంక్షేమానికి ఆయన పడిన తపన మరే ఇతర నాయకుడూ పడలేదని అన్నారు. అటువంటి నాయకుడిని భవిష్యత్‌లో అసలు చూడలేమన్నారు. వైఎస్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన తండ్రి ఆశయాలను కొనసాగించడం రాష్ట్ర ప్రజల అదృష్టమని వివరించారు. పార్టీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యాభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి వైఎస్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి, పేదలు కలలో కూడా ఊహించలేని ఉన్నత చదువులను వారికి అందుబాటులోకి వైఎస్ తీసుకొచ్చారని గుర్తుచేశారు. వైఎస్ మనకు దూరమై 15 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారంటే, ఆయన ఎంతటి చిత్తశుద్ధి ఉన్న రాజకీయ వేత్తో అర్థం చేసుకోవచ్చని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతూ పేదలకు ఉచిత విద్యతో పాటు, ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్ ప్రారంభించిన ఆరోగ్య శ్రీ పథకం దేశ విదేశాల్లో సంచలనం సృష్టించిందని తెలిపారు. లక్షలాది రూపాయల విలువ చేసే వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ 108 సేవలను ప్రజల చెంతకు తీసుకొచ్చి అత్యవసర వైద్యాన్ని అందించడం ద్వారా ఎన్నో పేద కుటుంబాల్లో దీపం పెట్టిన మహానుభావుడు వైఎస్ అని కొనియాడారు. వైఎస్ పాలనా కాలం రాష్ట్రంలో సువర్ణాధ్యాయమన్నారు. తుఫానులు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో తమ్మిలేరు ఇళ్లపై పడుతుందని తమ్మిలేరుకు రివిట్‌మెంట్ వాల్ నిర్మాణం వైఎస్ చలవతోనే జరిగిందని తెలిపారు. రాష్ట్రమంతా వరదలతో కొట్టుమిట్టాడుతుంటే ఏలూరు ప్రజలు గుండెలమీద చేయి వేసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నారంటే వైఎస్ దూరదృష్టే కారణమన్నారు. తొలుత వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు, ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు చేశారు. పార్టీ నాయకుడు పెరికే వరప్రసాదరావు సౌజన్యంతో ముద్రించిన అపర భగీరథుడు వైఎస్సార్ అనే పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్, పార్టీ నాయకులు నెరుసు చిరంజీవులు, మున్నుల జాన్ గురునాథ్, కిలాడి దుర్గారావు, ఎండీ ఖైసర్, వైఎస్‌వీ శివరావు తదితరులు పాల్గొన్నారు.



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న నాయకులు



వైఎస్సార్‌పై పెరికే ప్రసాద్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు



వైఎస్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు



వైఎస్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేసిన వైఎస్సార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను తన సొంత కుటుంబ సభ్యుల్లా చూసి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేవారని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామ్మోహనరావు అన్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులతో కలిసి స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని రాజశేఖరరెడ్డి విగ్రహానికి సోమవారం క్షీరాభిషేకం చేసి, పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీతాలు గణనీయంగా పెరగడానికి కృషి చేశారని గుర్తుచేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ లోకం వైఎస్ చేసిన మేలు ఎప్పటికీ మర్చిపోలేరని, ఉపాధ్యాయుల అప్రెంటిస్ కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన గొప్ప వ్యక్తని కొనియాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ఆంధ్ర ప్రజలు, ఉపాధ్యాయ, ఉద్యోగులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారన్నారు.

కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో..

ఏలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర అభివృద్ధికి దివంగత మహానేత ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసి దిశానిర్దేశనం చేశారని గుర్తుచేశారు. ఆయన పదవీ కాలం ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణయుగమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి చక్రవర్తి, గౌడ రంగబాబు, లంక రామ్మోహన్, సుబ్బారావు, రంభ కిషోర్, చెక్క గుప్త, కోసూరి చంద్రకాంతమ్మ, కందికుప్ప వెంకటేశ్వరరావు, నెరుసు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



వన్‌టౌన్‌లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణ

ఏలూరు టౌన్: ఏలూరు వన్ టౌన్ పరిధిలో నేరాల నిరోధానికి పటిష్ట చర్యలు చేపట్టామని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. వన్‌టౌన్ ప్రాంతంలో ఆయన విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల భద్రత, నేర నియంత్రణలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ కట్టుదిట్టం చేయడమేగాక, రహదారి ప్రమాదాల నివారణకు ప్రధానమైన కూడల్లో ముమ్మరంగా వాహనాల తనిఖీలు, హెల్మెట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

ఏలూరు(మెట్రో): తమ్మిలేరు వరదకు సంబంధించి 2వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించినట్లు ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సీహెచ్ దేవప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

వరద బాధితులకు ఏలూరు నుంచి ఆహారం సరఫరా

ఏలూరు (టూటౌన్): విజయవాడ వరద బాధితులకు ఏలూరు నుంచి ఆహారం సరఫరా చేస్తున్నారు. విజయవాడలో వరదల్లో చిక్కుకున్న బాధితులకు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పూటకు 10 వేల మందికి భోజనాలు తయారు చేయించి పంపిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నానికి కావాల్సిన భోజనాలను ఉదయం పంపించారు. రాత్రి 11 గంటల నుంచి కమిషనర్ ఎ.భాను ప్రతాప్, అదనపు కమిషనర్ సీహెచ్ చంద్రయ్య దగ్గరుండి ఏర్పాట్లు చేశారు. అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆహార పదార్థాలు తరలిస్తున్న లారీని మేయర్ నూర్జహాన్ జెండా ఊపి ప్రారంభించారు.

వరద బాధితులకు ఆహారం



ఆహార పదార్థాల వ్యాన్‌కు జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్

ఏలూరు టౌన్: భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న ఎన్టీఆర్ జిల్లాకు ఏలూరు ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ సౌజన్యంతో ఏలూరు జిల్లా శ్రీ సత్య సాయి సేవ ట్రస్ట్ వారు ఏలూరు నుంచి సోమవారం 10 వేల మందికి సరిపడే ఆహార పదార్థాలు, 10 వేల వాటర్ ప్యాకెట్లను మినీ వాన్‌లో పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి పంపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి, పోలీసు శాఖ సంయుక్తంగా భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన వారికి ఆహార పదార్థాలు అందించడం అభినందనీయమన్నారు. నిరాశ్రయులైన వారికి ఇంకా సహాయ సహకారాలు అందించాలని సత్యసాయి సేవా సమితి వారిని కోరారు.

రెండవ రోజూ జలదిగ్బంధంలోనే గ్రామాలు

వేలేరుపాడు: మండలంలోని అనేక గ్రామాల్లో సోమవారం కూడా వరద పరిస్థితిలో మార్పు లేదు. రహదారులు పూర్తిగా పాడైపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 17 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు. గోదావరి వరద ప్రభావంతో 18 గిరిజన గ్రామాలు, వాగులు పొంగడంతో మరో ఆరు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండలంలోని టేకూరు, యడవల్లి, ఎద్దెల వాగుల వంతెనలు నీట మునిగే ఉన్నాయి. ఎద్దెల వాగు వంతెన వద్ద అధికారులు దేశీయ బోట్‌ను ఏర్పాటు చేయగా, గ్రామాల ప్రజలు ఈ బోట్‌పై దాటుతున్నారు.

ఎస్క్రో పద్ధతిలో జీతాలు చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఎస్క్రో పద్ధతి ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మీటర్ రీడర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్) ఎం రూన్సీకి వినతిపత్రం అందజేశారు. ఈపీడీసీఎల్ డిస్కం పరిధిలో ఉన్న మీటర్ రీడర్స్ అందరికీ ఎస్క్రో ఖాతా తెరవాలని, కాంట్రాక్టర్లకు గత మార్చి నెల 7వ తేదీన విద్యుత్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ నేటికీ ఖాతాలు తెరవలేదని ఆరోపించారు. ఎస్క్రో ఖాతా ఓపెన్ చేయకపోతే సెప్టెంబర్ నెలలో మీటర్ రీడింగ్‌లు చేయలేమని పేర్కొన్నారు. తక్షణమే ఎస్క్రో అకౌంట్స్ ఓపెన్ చేసేలా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. ఏలూరు సర్కిల్ పరిధిలో బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కొందరు కాంట్రాక్టర్లు తమ భార్యల పేరుతో కాంట్రాక్టులు పొందారని, కొందరు షిఫ్ట్ ఆపరేటర్లు, సబ్ స్టేషన్ల వాచ్‌మన్‌లు సైతం కాంట్రాక్టర్లుగా మారి బిల్లింగ్ కాంట్రాక్టులు దక్కించుకుని మీటర్ రీడర్లకు సరైన వేతనాలు అందించడం లేదని పేర్కొన్నారు. అటువంటి వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఒ.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, కె.నాగమల్లేశ్వరరావు ఆర్ అప్పల స్వామి, కె.మురళీబాబు పాల్గొన్నారు.



ఈఈ రూన్సీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైలు కింద పడి ఫొటోగ్రాఫర్ మృతి

ఏలూరు టౌన్: రైలు కింద పడి ఫొటోగ్రాఫర్ మృతిచెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ చిప్పాడ వీరభద్రుడు (50) ఏలూరు బంధువుల ఇంటికి వచ్చేందుకు ఈనెల 1న రైలు ఎక్కారు. రైలు ఏలూరు రాకుండా గుడివాడ మీదుగా భీమవరం వెళుతుండగా మార్గమధ్యంలో కైకలూరు రైల్వేస్టేషన్‌లో రైలు దిగి ఏలూరు వెళదామనుకున్నారు. ఈ విషయం చెప్పటంతో బంధువులు ఏలూరు నుంచి కారులో కైకలూరు బయలుదేరారు. రైలు కై కలూరు రైల్వేస్టేషన్‌లో పూర్తిగా ఆగకుండానే వీరభద్రుడు రైలునుంచి కిందకు దూకి ప్రమాదవశాత్తూ పడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఇతన్ని బంధువులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు అత్యవసర విభాగంలో చికిత్సనందిస్తుండగా సోమవారం తెల్లవారుజామున మృతిచెందారు. భీమవరం రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	7,10
బెండకాయలు	28	కంద	60
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	36
కాకర కాయలు	30	కీరా దోస	50
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	84
బీరకాయలు (పందిరి)	44	అల్లం	80–160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	40
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	50	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	28	బజాజీ	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	54

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – తిరుపతి	16.00	4830	29

విద్యారంగ సమస్యలపై వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో విద్యారంగం, ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అత్యవసరంగా గుర్తించి వెంటనే పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ నాయకులు ఎమ్మెల్యే బడేటి చంటికి ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. 117, 128 జీఓలను తక్షణం రద్దు చేయాలని, పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను అధిగమించడానికి పని సర్దుబాటు ద్వారా కాకుండా వెంటనే ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఏడాదిగా నిలిచిపోయిన నెలవారీ పదోన్నతుల ప్రక్రియను తిరిగి ప్రారంభించాలని కోరారు. తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాలు కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీబీఎస్ఈ బోర్డుకు అనుసంధానం చేసిన పాఠశాలలను తిరిగి వెనుకకు తీసుకోవాలని, ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ స్థానంలో తిరిగి స్టేట్ సిలబస్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తాళ్లూరి రామారావు, కొరమ ఆనంద్ కుమార్, అబ్బదాసరి శ్రీనివాస్, ఎం కొండయ్య, ఎ.సాంబమూర్తి, ఎంఎస్ఎన్ మూర్తి, ఎం వెంకటేశ్వరరావు, జంపిన శాంతి కుమార్, కొడమంచిలి కుమార్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే చంటికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

6న గణపతి మట్టి ప్రతిమల పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 7వ తేదీన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పూజలు చేసే స్థానిక ప్రజలకు గణపతి మట్టి ప్రతిమలు పంపిణీ చేయనున్నట్టు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు నేరెళ్ల రాజేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి స్థానిక మర్చంట్స్ చాంబర్ బిశ్వనాథ్ భర్తియా కల్యాణ మండపం వద్ద సూర్యా గ్రూప్ సంస్థల అధినేత చామర్తి కృష్ణారావు సహకారంతో 5 వేల మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వీటితో పాటు రెండు వేల పూల మొక్కలు కూడా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి సహాయం

ద్వారకాతిరుమల: జి.కొత్తపల్లిలో ఇటీవల మృతిచెందిన రేవూరి సుబ్బారావు కుటుంబానికి స్థానిక ఎంపీటీసీ బిరుదుగడ్డ బజారయ్య సోమవారం రెండు బియ్యం బస్తా లు, ఒక ఉల్లి బస్తా, అలాగే 15 కేజీల మంచినూనె డబ్బాతో పాటు రూ.1000 ఆర్థిక సాయంగా సుబ్బారావు కుమారుడు మల్లేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పున్నమి కృష్ణ, పొంగులేటి సంతోష్, బోర్డర్ రవి, రేవూరి ఏసు, రేవూరి వెంకన్న, నాగార్జున, శంకర్, వెంకటేష్, రమేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 5.1 మి.మీ వర్షపాతం

ఏలూరు(మెట్రో): జిల్లాలో 5.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలో 5.1 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా కుక్కునూరులో 20.6 మి.మీ నమోదు కాగా, అత్యల్పంగా కలిదిండిలో 0.6 మి.మీ నమోదైంది. టి.నరసాపురం మండలంలో వర్షపాతం నమోదు కాలేదు. వేలేరుపాడు 17.0 మి.మీ, నూజివీడు 11.4 మి.మీ నమోదు కాగా, మిగిలిన మండలాల్లో 10 మి.మీ లోపే వర్షపాతం నమోదైంది.